ఖరీదైన ప్రభుత్వ స్థలం

ఆక్రమణ

- అధికారుల విధులను అడ్డుకున్న వ్యక్తిపై కేసు
- ఆక్రమణలను తొలగించిన రెవెన్యూ సిబ్బంది

బంజారాహిల్స్,మార్చి 16: ఖరీదైన ప్రభుత్వ స్థలం ఆక్రమించడమే కాకుండా పరిశీలనకు వచ్చిన రెవెన్యూ అధికారుల విధులను అడ్డుకున్న వ్యక్తిపై జూబ్లీహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదయింది. పోలీసుల వివరాల ప్రకారం.. షేక్‌పేట మండల పరిధిలోని జర్నలిస్ట్ కాలనీలో ప్లాట్ నం. ఏ-7. ఏ-8 వెనకాల సుమారు 700 గజాల ప్రభుత్వ స్థలాన్ని పురుషోత్తమ్‌రెడ్డి అనే వ్యక్తి ఆక్రమించాడు. బండరాళ్లను తొలగించి చదును చేసుకోవడంతోపాటు గదులు నిర్మించి, ప్లే గ్రౌండ్‌ను సైతం ఏర్పాటు చేశాడు. సమాచారం అందుకున్న షేక్‌పేట మండల తాసీల్దార్ అనితారెడ్డి తన సిబ్బందితో కలిసి శుక్రవారం పరిశీలనకు వెళ్లగా పురుషోత్తం రెడ్డి తన ఇంటికి గేట్లు వేసుకుని వాళ్లను లోనికి రానివ్వలేదు. కబ్జాకు గురయిన ప్రభుత్వ స్థలంలోకి రాకుండా అడ్డుకోవడంతో పాటు వాగ్వాదానికి దిగాడు. సెల్‌ఫోన్‌తో వీడియో తీస్తూ మీ అంతుచూస్తానంటూ బెదిరింపులకు పాల్పడ్డాడు. ఈ మేరకు శనివారం తాసిల్దార్ జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా ఐపీసీ 447, 427, 353 రెడ్‌విత్ 34 సెక్షన్‌తో పాటు పీడీపీపీ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు.

పోలీసుల బందోబస్తుతో కూల్చివేతలు..

జర్నలిస్ట్ కాలనీలోని ప్లాట్ నంబర్ ఏ-7, ఏ-8 వెనకాల ఉన్న సుమారు 700 గజాల ప్రభుత్వ స్థలంలో వెలిసిన ఆక్రమణలను శనివారం షేక్‌పేట రెవెన్యూ సిబ్బంది పటిష్టమైన పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేశారు. అక్రమంగా వేసుకున్న ప్లే గ్రౌండ్‌ను, ఫ్లోరింగ్‌ను జేసీబీ సాయంతో తొలగించడంతోపాటు ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. రెవెన్యూ సిబ్బందిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన పురుషోత్తంరెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు.

బీఆర్ఎస్ శ్రేణుల్లో ఆగ్రహ జ్వాల

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టుపై వెల్లువెత్తిన నిరసన..
- ప్రధాని మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు
- బోరబండ బస్ టెర్మినల్, కేబీఆర్ పార్క్, శంషాబాద్‌లో ఆందోళన, ధర్నా
- పథకం ప్రకారమే ఎమ్మెల్సీ కవిత అరెస్టు : ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్



బోరబండ బస్ టెర్మినల్ చౌరస్తా వద్ద నిరసన ప్రదర్శనలో ఎమ్మెల్యే మాగంటి, బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

ఎర్రగడ్డ, మార్చి 16: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టు పట్ల బీఆర్ఎస్ శ్రేణుల్లో నిరసన జ్వాల రేగింది. శనివారం బోరబండ బస్ టెర్మినల్ చౌరస్తాలో కవిత అరెస్టును నిరసిస్తూ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనలో వందలాదిగా పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. ప్రధాని మోదీ వ్యతిరేక నినాదాలతో బస్ టెర్మినల్ పరిసరాలు దద్దరిల్లాయి. వారంతా నల్ల బ్యాడ్జీలు ధరించి శాంతియుతంగా నిరసన ప్రదర్శనకు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేంద్రంలోని ప్రధాని మోదీ సర్కారు ఎన్ని కుతంత్రాలు పన్నినా కార్యకర్తలు భయపడేది లేదన్నారు. ఉద్యమ పార్టీ అయిన బీఆర్ఎస్ నేతలను కేసులు, ఇతర అవమానాలకు గురిచేయటమే ధ్యేయంగా బీజేపీ పావులు కదుపుతున్నదని విమర్శించారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీగా బీఆర్ఎస్‌కు ఉన్న ఇమేజ్‌ను దెబ్బతీయడానికి ప్రధాని మోదీ, సీఎం రేవంత్‌రెడ్డిలు కుమ్మక్కయ్యారని పేర్కొన్నారు. గుజరాత్‌లో మతపరమైన అల్లర్లు జరిగిన సందర్భంలో ఎంతో మంది ముస్లింలు ప్రాణాలు కోల్పోయారని.. ఆ పరిస్థితిని తెలంగాణలో తేవడానికి రేవంత్, మోదీలు పథకం ప్రకారం ముందుకు వెళ్తున్నారని మాగంటి విమర్శించారు. మహిళ అని కూడా చూడకుండా కవితను అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు.

తరలి వచ్చిన గులాబీ శ్రేణులు.

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ పిలుపు మేరకు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల నుంచి బీఆర్ఎస్ శ్రేణులు తరలి వచ్చారు. దీంతో బోరబండ బస్ టెర్మినల్ వద్ద బోరబండ పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు. నిరసన ప్రదర్శనలో కార్పొరేటర్ దేదీప్య, డివిజన్ల అధ్యక్షులు కృష్ణమోహన్, సంజీవ, ప్రదీప్, సీనియర్ నాయకులు విజయకుమార్, సంతోష్ ముదిరాజ్, దేవమణి, గీతాగౌడ్, ఖదీర్, లియాఖత్ అలీ, యూసుఫ్, ఆనంద్‌కుమార్, బాబా నాయక్, బొట్టుశివ, రమేశ్‌యాదవ్, చంద్రశేఖర్, బస్వరాజ్, రమేశ్‌నాయక్, సూర్యకళ, రాము, బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

కేబీఆర్ పార్కువద్ద నిరసన..

బంజారాహిల్స్, మార్చి 16: బీఆర్ఎస్ పార్టీపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారని ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత అరెస్ట్‌ను నిరసిస్తూ శనివారం బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కువద్ద ఖైరతాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు నల్ల జెండాలతో ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్లు మన్నె కవితారెడ్డి, వెల్దండ వెంకటేశ్‌తో కలిసి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో ప్రతిపక్ష పార్టీలను కట్టడి చేసేందుకు బీజేపీ ప్రభుత్వం చేస్తున్న కుట్రలన్నీ ప్రజలకు తెలుసన్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందు బీఆర్ఎస్ పార్టీని దెబ్బతీయాలన్న లక్ష్యంతో ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోరాటాలు బీఆర్ఎస్ పార్టీకి కొత్త కావని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కుట్రలకు వ్యతిరేకంగా పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వంలో ఖచ్చితంగా పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ సందర్భం గా జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెంకటేశ్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిన హామీలను గాలికి వదిలిపెట్టి గాలిమాటలు మాట్లాడుతోందని, బీజేపీ నాయకులు ఈడీ, ఐటీల పేరుతో బీఆర్ఎస్ పార్టీని దారికి తెచ్చుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో పాటు భారత జాగృతి కార్యకర్తలు పాల్గొని మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

శంషాబాద్ పట్టణంలో భారీ ధర్నా..

శంషాబాద్ రూరల్, మార్చి 16 : ప్రధాని నరేంద్రమోదీ రాజకీయ కక్ష సాధింపులో భాగంగానే ఎమ్మెల్సీ కవితను అక్రమంగా అరెస్టు చేశారని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చంద్రారెడ్డి అన్నారు. శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అక్రమ అరెస్టుకు నిరసనగా శంషాబాద్ పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్ఎస్ నాయకులు భా రీ ధర్నా , రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ ... సుప్రీంకోర్టు ఆదేశాలను తుంగలోతొక్కి అరెస్టు చే యడం ఏమిటని ప్రశ్నించారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీలు కలిసి బీఆర్ఎస్ నాయకులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, ఎంపీపీ జయమ్మ, జడ్పీటీసీ తన్వీరాజు, కౌన్సిలర్లు, ఎంపీటీసీ లు, మాజీ సర్పంచ్‌లు, నాయకులు నీరటి రాజుముదిరాజ్, శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్‌యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం హైదరాబాద్-బెంగుళూరు జాతీ య రహదారిపై రాస్తారోకో నిర్వహించారు.

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్టుకు నిరసనగా బంజారాహిల్స్‌లోని కేబీఆర్ పార్కువద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

శంషాబాద్ పట్టణంలోని హైదరాబాద్- బెంగుళూరు జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

శంషాబాద్ పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు అదృశ్యం

శివలీల (ఫైల్)

ఖైరతాబాద మార్చి 16 : ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైంది. ఖైరతాబాద్ ఏఎస్సై శ్రీరాములు వివరాల ప్రకారం....ఖైరతాబాద్‌కు చెందిన పి.సబప్ప కుమార్తె శివలీలా (20) బంజారాహిల్స్ రోడ్ నం.1 లోని ఓ బేకరీలో పనిచేస్తున్నది. ఈ నెల 14న మధ్యాహ్న భోజనం కోసం షాపు నుంచి ఇంటికి వచ్చింది. అనంతరం ఆధార్‌కార్డు తీసుకుని బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా, మిస్సింగ్ కేసు నమోదు చేశారు.

మారుతీనగర్‌లో వివాహిత..

ఖైరతాబాద్‌లోని మారుతీనగర్‌కు చెందిన గూడూరు గణేశ్ కు భార్య శ్రావణి (21), రెండు సంవత్సరాల కుమార్తె ఉన్నారు. గణేశ్ ప్రైవేట్ ఉద్యోగం చేస్తుండగా, ఈ నెల 14న విధులకు వెళ్లి రాత్రి 9గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అప్పుడు కూతురు ఒక్కతే ఉండగా , భార్య లేదు. మొత్తం గాలించినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేపట్టారు.

రోడ్డుపై పడిన నూనె.. స్పందించిన యువత

బస్తీ ప్రధాన రహదారిపై శనివారం నూనెను పోలిన ఇంధనం రోడ్డుపై పడ డంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడ్డారు. స్థానిక యువత జె.రాము, కిరణ్ ముదిరాజ్‌లు స్పందించి రోడ్డుపై మట్టిని, బ్లీచింగ్ పౌడర్‌లను చల్లించారు. ఈ సహాయక కార్యక్రమాల్లో సమీపంలో విధులు నిర్వర్తిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌తో పాటు బల్దియా సిబ్బంది పాల్గొన్నారు. వాహనదారులు తక్షణమే స్పందించిన యువతను అభినందించారు.

– జూబ్లీహిల్స్,మార్చి 16

అధునాతన టెక్నాలజీని ఉపయోగించుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 16: ప్రస్తుత యాంత్రిక జీవనంలో అధునాతన టెక్నాలజీని ఉపయోగించుకుంటూ విద్యార్థులు తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలని మహవీర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాల కార్యదర్శి సురేంద్ర సురేడ్డి అన్నారు. శనివారం కళాశాలలో 'హైపర్ సోనిక్ మిజైల్ టెక్నాలజీ' అనే అంశంపై సెమినార్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీవో సైంటిస్ట్ డాక్టర్ దబాసిన్ చక్రవర్తి హాజరై మాట్లాడుతూ.. భారతదేశం రాకెట్ ప్రయోగాల్లో అత్యున్నత స్థాయి మిజైల్ టెక్నాలజీ కలిగి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉషాశ్రీ, ఐఐసీ కోఆర్డినేటర్ వీఎస్ ప్రతిభ, డాక్టర్ వెంకటేశ్వర్‌రెడ్డి, హెచ్‌వోడీ మెకానికల్ డాక్టర్ శ్రీకాంత్‌రెడ్డి, హెచ్‌వోడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవధాని డాక్టర్ ధూళిపాళకు ఉషశ్రీ అవార్డు

ఖైరతాబాద్, మార్చి 16: ఉషశ్రీ మిషన్, వ్యూస్ సంయుక్తా ఆధ్వర్యంలో శనివారం రాత్రి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అవధాని, పద్మ కళాత పస్వీ డాక్టర్ ధూళిపాళ మహదేవమణికి ఉషశ్రీ సంస్కృతి పురస్కారాన్ని అందజేశారు. డాక్టర్ ఎఎస్ రామశాస్త్రి అధ్యక్షతన జరిగిన ఈ కార్య క్రమంలో ప్రవచనకర్త అనంత లక్ష్మి, ఉషశ్రీ కు టుంబ సభ్యులు గాయత్రి దేవి, పద్మావతి, వైజ యంతి, సూర్యమ, శ్రీ విద్య, తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం..

విల్లా మేరీలో విద్యార్థినుల ఆటాపాట

ఖైరతాబాద్, మార్చి 16 : విల్లా మేరీ అలూమ్ని అసోసియేషన్, ఐక్యూఏసీ కళాశాల విభాగం ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం శనివారం సోమాజిగూడలోని కళాశాల ఆడిటోరియంలో జరిగింది. ఈ వేడుకలను కళాశాల వ్యవస్థాపకురాలు, డైరెక్టర్ డాక్టర్ ఫిలోమినా, కళాశాల కార్యదర్శి చిన్నమ్మ, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ రేవతి దేవి, పూర్వవిద్యార్థుల సమ్మేళనం నిర్వాహక అధ్యక్షుడు డాక్టర్ నవీన్ కుమార్‌తో కలిసి ప్రారంభించారు. 1998 నుంచి 2023వరకు కళాశాలలో చదువుకున్న విద్యార్థులు ఒకే చోటకుచేరి ఆట పాటలతో తమ పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అలూమ్ని నిర్వాహకులు జాహ్నవి, మేఘా బంగ్, శివానీ, అంబికా, తబిత, తదితరులు పాల్గొన్నారు.

నిమ్స్‌లో కార్డియాక్ వర్క్‌షాప్

ఖైరతాబాద్, మార్చి 16: నిమ్స్ దవాఖానలో సీవీటీఎస్ బూట్ క్యాంప్ పేరుతో కార్డియాక్ వర్క్‌షాప్‌ను శనివారం దవాఖానలోని ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌ను ముఖ్య అతిథిగా హాజరైన డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప ప్రారంభించారు. కార్డియాలజీకి సంబంధించి అందుబాటులోకి వచ్చిన ఆధునిక చికిత్స విధానాలు, గుండెలోని వివిధ భాగాలకు అందించే కొత్త చికిత్సలు, నూతన ఆవిష్కరణలు, తదితర అంశాలను ఈ సదస్సులో చర్చిం చారు. ఈ సదస్సులో నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజేఖ ర్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ నిమ్మ సత్యనారాయణ, కోఆర్డియో థోరాసిక విభాగాధిపతి డాక్టర్ అమరేష్ రావు, కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ టి. రామకృష్ణ దేవ్, డాక్టర్ పీఎస్ ఎస్ గోపాల్ పాల్గొన్నారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

బండ్లగూడ,మార్చి 16: పద్మశ్రీ హిల్స్ కాలనీలో మంచినీటి సమస్యలను పరిష్కరించాలని కాలనీ వాసులు బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ శరత్ చంద్రకు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమ కాలనీలో పది లక్షల లీటర్ల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్ నిర్మాణానికి జలమండలి నుంచి అనుమతి ఉందన్నారు. పద్మశ్రీహిల్స్‌లోని ఎత్తుపైన ఉన్న ఖాళీ స్థలాన్ని రిజర్వాయర్ కోసం కేటాయించి నిర్మాణం చేపట్టి మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరారు.

మానవీయ విలువలకు ప్రతీక రంజాన్

హిమాయత్‌నగర్,మార్చి16: మానవీయ విలువలకు రంజాన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని హిమాయత్‌నగర్ కార్పొరేటర్ మహాలక్ష్మి రామన్‌గౌడ్, అంబర్‌పేట సర్కిల్ -16 ఏఎంహెచ్‌వో హేమలత అన్నారు. రంజాన్ మాసం నేపథ్యంలో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు శనివారం కింగ్‌కోఠి, రాంకోఠి, షేర్‌ఘాట్, హిమాయత్‌నగర్ ప్రాంతాల్లో ప్లాస్టిక్ కవర్లను అందజేశారు.

సమస్యాత్మక ప్రాంతాల్లో ప్రీకాస్ట్ స్లాబ్‌లు..

వరద ముంపు సమస్యలు రాకుండా ముందస్తు చర్యలు..

యూసుఫ్‌గూడలో చేపడుతున్న ప్రీకాస్ట్ స్లాబ్ పనులు అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఈఈ రాజ్‌కుమార్

జూబ్లీహిల్స్, మార్చి16 : వర్షాలకు వరద ముంపు సమస్యలు రాకుండా జీహెచ్ఎంసీ అధికారులు ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. నాలాలు ఓవర్ ఫ్లో కాకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నారు. ముందు జాగ్రత్తగా వర్షాలు రాకముందే నాలాల్లో పూడికతీత పనులు చేపడుతున్న అధికారులు సమస్యాత్మక ప్రాంతాల్లో పూడికతీతకు అనువుగా పనులు చేపడుతున్నారు. నాలాల్లో వరద ప్రవాహం నిలిచిపోయినప్పుడు వేగంగా పూడికతీత పనులు చేపట్టేందుకు ప్రీకాస్ట్ స్లాబ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. వరద ఉధృతిని బట్టి ఆయా సమస్యాత్మక ప్రాంతాల్లో అప్పటికప్పుడు నాలా స్లాబ్‌లను తొలగించి యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టనున్నారు.

ఈ మే రకు శనివారం యూసుఫ్‌గూడ సర్కిల్‌లో నా లాలపై ఏర్పాటు చేస్తున్న ప్రీకాస్ట్ స్లాబ్ పనులను 19వ సర్కిల్ ఈఈ రాజ్‌కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. నాలాలను పూ ర్తిగా మూసివేయకుండా చేపడుతున్న ప్రీకాస్ట్ స్లాబ్ పనులతో పూడికతీత సులువవుతుందని తెలిపారు. యూసుఫ్‌గూడ సర్కిల్‌లో నాలాలపై చేపడుతున్న పనులను..ప్రీకాస్ట్ స్లాబ్‌ల నాణ్యతను వారు పరిశీలించారు. కొన్నిచోట్ల పాత స్లాబ్‌లను తొలగించి నాణ్యమైన కొత్త స్లాబులను వేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈఈ రామచంద్రరాజు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 6,215 కేసుల పరిష్కారం

బండ్లగూడ, మార్చి 16: రాజీమార్గం ద్వారా అనేక కేసులను పరిష్కరించుకోవచ్చు ని రాజేంద్రనగర్ మండల సేవాధికార సంస్థ చైర్మన్,11వ అదనపు న్యాయమూర్తి నీలిమ అన్నారు. రాజేంద్రనగర్‌లో జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మొత్తం 6,215 కేసులను పరిష్కారించారు. ఇందులో రాజీ పడిన కేసులు 177,అడ్మిషన్ కేసులు 317,డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 1935, ఈ పెట్టి కేసులు 3503,విద్యుత్ చౌర్యం కేసులు 283లను పరిష్కరించినట్లు సంబంధిత అధికారులు తెలిపారు.ఈ లోక్ అదాలత్‌లో 12వ అదనపు న్యాయమూర్తి రాజ్‌కిరణ్, 13వ న్యాయమూర్తి అంకిత్‌సర్వ, స్పెషల్ కోర్టు న్యాయమూర్తి రవికుమార్, ఏపీపీలు శీనయ్య, ప్రవీణ్‌నాయక్, సంగీత, బార్ అసోసియేషన్ సభ్యులు, పలువురు ఇన్‌స్పెక్టర్లు ఉన్నారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్‌కు సన్మానం

మైలార్‌దేవ్‌పల్లి, మార్చి 16 :తెలంగాణ రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డిని రంగారెడ్డి జిల్లా ఏఐటీయూసీ కార్యదర్శి వ నంపల్లి జైపాల్‌రెడ్డి శనివారం కలి శారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువా కప్పి సన్మానించారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి..

మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశంలో భాగంగా మధ్యాహ్న భోజనంలో వడ్డిస్తున్న దృశ్యం

మణికొండ, మార్చి 16: విద్యార్థులు కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సులభంగా సాధించగలరని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి అన్నారు. శనివారం మణికొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు 9వ తరగతి విద్యార్థులు వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రామకృష్ణారెడ్డి, సంఘ సేవకులు శ్రావణ్‌కుమార్‌ల ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేశారు. వీడ్కోలు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే పాఠశాలలో చదువుకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకొని తమ అనుభవాలను పంచుకున్నారు. అనంతరం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ.. పదవ తరగతి పరీక్షలు విద్యార్థులకు తొలి మెట్టు అన్నారు. మొదటిమెట్టులో తడబడకుండా కష్టపడి చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఫర్ సహయోగ్ చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ అందె లక్ష్మణ్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దెదింపాలి : ఏఐవైఎఫ్

హిమాయత్‌నగర్, మార్చి16: దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్న ప్రధాని మోదీ ప్రభుత్వాన్ని గద్దె దింపేందుకు పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర యువతకు పిలుపు నిచ్చారు. భగత్‌సింగ్, రాజ్ గురు, సుఖ్‌దేవుల 91వ వర్ధంతి సందర్భంగా శనివారం హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్ వద్ద ప్రచార హోర్డింగ్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భగత్‌సింగ్ జీవితం యువతకు స్ఫూర్తి దాయకమని,వీరి వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ప్రజల్ని మోసం చేసిందని,ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంలో విఫలమైందన్నారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు శ్రీకాంత్,రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్య ప్రసాద్, కల్యాణ్, అరుణ్, కిరణ్,మధు,సల్మాన్ పాల్గొన్నారు.

హిమాయత్‌నగర్‌లో ప్రచార హోర్డింగ్‌ను ఆవిష్కరిస్తున్న ధర్మేంద్ర

మసాజ్ ముసుగులో వ్యభిచారం

బంజారాహిల్స్, మార్చి 16: మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచార గృహం నడిపిస్తున్న ఇద్దరు వ్యక్తులను బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. పోలీసుల కథనం ప్రకారం ... బంజారాహిల్స్ రోడ్ నం. 12 , శ్రీరాంనగర్‌లోని ఓఅపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్‌ను కూకట్‌పల్లికి చెందిన ఓ మహిళ అద్దెకు తీసుకుంది. కొంతకాలంగా 'బ్యూటీ ప్లానెట్ స్పా' పేరుతో మసాజ్ సెంటర్ నిర్వహిస్తోంది. డబ్బులకు ఆశపడి యువతులను తీసుకువచ్చి వ్యభిచారం చేయిస్తుంది. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు శుక్రవారం రాత్రి ఆ ఫ్లాట్‌పై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో స్పా మేనేజర్ మహ్మద్ ఆదిల్‌తో పాటు కస్టమర్ మోయిన్ అలీ పట్టుబడ్డారు. ముగ్గురు సెక్స్ వర్కర్లను కాపాడి రెస్క్యూ హోమ్‌కు తరలించారు.నిర్వాహకురాలు పరారీలో ఉన్నారు. ఈ మేరకు పోలీసులు నిందితులపై కే సు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రండి..

మణికొండ, మార్చి 16: చలివేంద్రాలను ఏర్పాటు చేసేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని మణికొండ వాసవిక్లబ్ కపుల్స్ అధ్యక్షుడు వంగవీటి వంశీకృష్ణ అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకొని శనివారం మణికొండ వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో అభినందన కన్‌స్ట్రక్షన్స్ ఎండీ వెంకటేశ్, స్వప్నల సహకారంతో మణికొండ బస్టాప్ లేబర్ అడ్డా వద్ద చలివేంద్రాన్ని, మజ్జిగ కేంద్రాన్ని ఏర్పాటు చేయగా వంశీకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించి పేద ప్రజలను ఆదుకోవడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి తల్లాడ యశ్వంత్, కోశాధికారి శిరీష, జోన్ చైర్మన్ కలగార్ల నిరీష, రీజియన్ చైర్మన్ గంగిశెట్టి నవీన్‌కుమార్, రీజియన్ సెక్రటరీ రామ్‌సురేశ్, డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జి కిరణ్‌కుమార్, క్లబ